# గ్రంథాలయశాస్త్ర పితామహులు

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో గ్రంథాలయాలు కొన్ని మాత్రమే ఉండేవి. అవి కొద్దిమంది సంపన్నులకే ఉపయోగపడేవి. దేశంలో ప్రతి పౌరుడు విద్యావంతుడు కావాలని, అందరూ పాఠశాలలకు వెళ్లలేరని, తరగతి గదుల్లో నేర్చుకున్నది సరిపోదని, జీవితం-సమాజం గురించి తెలుసుకోవాలని రంగనాథన్ భావించారు. దీనికోసం మద్రాసు విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్రోపన్యాస వృత్తికి స్వస్తి చెప్పి 1924లో అదే విశ్వవిద్యాలయంలో గ్రంథాలయాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. దానిని ఒక ప్రయోగశాలగా మార్చుకొని 20 ఏళ్లు అక్కడే ఉండి అహోరాత్రులు శ్రమించి పరిశోధన చేసి దేశానికి కావలసిన గ్రంథాలయ చట్టాలను రూపొందించిన మహావ్యక్తి రంగనాథన్.

డాక్టర్ షియాలి రామామృత రంగనాథన్ 9-8-1892లో తంజావూరు జిల్లాలోని షియాలి గ్రామంలో జన్మించినప్పటికినీ, రికార్డు ప్రకారం అధికార పూర్వకంగా వారి జన్మదినం 12-8-1892గా నమోదైంది. అందుకని ప్రతి సంవత్సరం ఆగస్టు 12న మనం వారి జయంతి ఉత్సవాలను జరుపుకొంటున్నాం. అలాగే ఈ రోజునే గ్రంథాలయ దినోత్సవంగా కూడా గుర్తించారు. 1948లో ఢిల్లీ యూనివర్సిటీ ద్వారా డీలిట్ డిగ్రీని , 1964లో అమెరికాలోని పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న భాగ్యశాలి. అంతర్జాతీయ గ్రంథాలయ శాస్త్ర ఆచార్యునిగా పేరు గడించిన గొప్ప మేధావి డాక్టర్ రంగనాథన్.

1970లో వారిని అమెరికన్ గ్రంథాలయ సంఘం 'మార్గరెట్ మ్యాన్' అనే బిరుదుతో సత్కరించింది. వీరికి 1957లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది. రంగనాథన్‌గారు 50 ఏళ్లు చాపపై పడుకొని, కాఫీ, టీ తాగకుండా సాత్వికాహారాన్ని ఒక పూట తింటూ సీదాసాదా జీవితం గడిపారు. వారు సంపాదించిన లక్ష రూపాయలను గ్రంథాలయాల అభివృద్ధికి బహూకరించారు. తానే స్వయంగా 1928లో మద్రాసు లైబ్రరీ అసోషియేషన్‌ను స్థాపించారు. అలాగే 1929లో మద్రాసు విశ్వవిద్యాలయంలో మొట్టమొదటిసారిగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్సును ప్రారంభించిన భారతదేశ ప్రప్రథమ గ్రంథాలయ శాస్త్ర ఉపాధ్యాయులు.




రంగనాథన్ గారు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గ్రంథాలయ చట్టాలు కావాలని, ప్రణాళికను రూపొందించారు. వారి కృషి ఫలితంగానే చాలా రాష్ట్రాల్లో గ్రంథాలయాలు ప్రారంభించబడి,గ్రంథాలయ చట్టాలు అమలులోకి వచ్చాయి.

రంగనాథన్ బ్రిటన్‌లో తొమ్మిది నెలలు ఉన్నప్పుడు అక్కడి గంథాలయాల చట్టాలను లోతుగా అధ్యయనంచేసి, దాదాపు వంద గ్రంథాలయాలను చూసి వాటి పనితీరును, లోతుపాతులను తెలుసుకున్నా

రు. వాటితో పౌరులు పొందుతున్న ప్రయోజనాలను అధ్యయనం చేశారు. ఆ దేశ ప్రజలు పొందుతున్న ప్రయోజనాలను గమనించి భారతదేశంలో కూడా ఇలాంటి గ్రంథాలయ చట్టాలు అత్యవసరమని భావించి స్వదేశానికి విమానంలో కాకుండా పడవలో ప్రయాణమయ్యాడు. ఈ ప్రయాణ కాలాన్ని మొత్తం గ్రంథాలయ చట్టాలను రూపొందించడం కోసం ఆలోచించాడు. మొదట అవిభక్త మద్రాసు రాష్ట్రంలో 1948లో గ్రంథాలయ చట్టం తెప్పించారు. దాని ఆధారంగా 1955లో హైద్రాబాదు నగర పౌర గ్రంథాలయ చట్టం వచ్చింది. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ రెండింటినీ కలిపి 1960లోఆంధ్రప్రదేశ్ పౌరగ్రంథాలయ చట్టం రూపొందించారు. ఈ కృషి ఫలితంగానే నేడు రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం,ఏడు ప్రాంతీయ గ్రంథాలయాలు, నగర కేంద్ర గ్రంథాలయం, వంద శాఖా గ్రంథాలయాలు, జిల్లా గ్రంథాలయాలు, వెయ్యికి పైగా మండలస్థాయి గ్రంథాలయాలు ఏర్పడ్డాయి.

రంగనాథన్‌గారు 1947నుంచి 54 వరకు ఢిల్లీ యూనివర్సిటీలోని గ్రంథాలయశాస్త్ర విభాగానికి అధిపతిగా కొనసాగుతూ, 1952లో ఇండియన్ నేషనల్ సైంటిఫిక్ డాక్యుమెంటేషన్ కేంద్రాన్ని స్థాపించారు. 1962లో బెంగుళూరులో డాక్యుమెంటేషన్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ కేంద్రాన్ని స్థాపించారు. 1953-56,1959-61 సంవత్సరాల్లో వీరు అంతర్జాతీయ డాక్యుమెంటేషన్ సంఘానికి ఉపాధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. బ్రిటిష్ గ్రంథాలయ సంఘానికి గౌరవ ఉపాధ్యక్షునిగా వ్యవహరించారు. 1958లో రంగనాథన్ గారు జపాన్, కెనడా, అమెరికా, లండ న్ ,యూరప్ దేశాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. వీరి కృషి ఫలితంగానే.. నేడు స్థానిక సంస్థల నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకు గ్రంథాలయ సమాచార శాస్త్రంలో సర్టిఫికేట్, డిప్లొమా, బ్యాచులర్, మాస్టర్ డిగ్రీలు అందుబాటులోకి వచ్చాయి. వీరు ఆరితేరిన గ్రంథాలయాధికారి మాత్రమేగాక, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గ్రంథాలయ శాస్త్ర ఉపాధ్యాయుడు. దాదాపు 62 ప్రామాణిక పుస్తకాలు, రెండువేలకు పైగా పరిశోధనా వ్యాసాలు రాశారు. ఐదు పత్రికలను నిర్వహించారు. వీరి పుస్తకాలు ప్రపంచంలోని అన్ని దేశాల్లో పాఠ్యాంశాలుగా బోధించబడుతున్నాయి.

రంగనాథన్‌గారు 1972 సెప్టెంబర్ 27న బెంగుళూరులో కన్నుమూశారు. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గాంచిన రంగనాథన్ ఆశయాలను నెరేవర్చడమంటే..మనం గ్రంథాలయోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడమే.

**–డాక్టర్ ఎం. కనకాచారి**

ఇఫ్లూ ఉప గ్రంథాలయాధికారి

**(నేడు ఎస్ఆర్ రంగనాథన్ 120 వ జయంతి)**